## క్లుప్తంగా

### 'పది' టాపర్లకు నగదు అందజేత

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో 2023–24 సంవత్సరంలో పదోతరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రస్తుతం చికాగో నగరంలో నివసిస్తున్న పిండి సంతోష్, వారి మిత్రులు నగదు ప్రోత్సాహకాలు అందజేసినట్లు హెచ్ఎం రమేశ్ తెలిపారు. మాదాసి రమ్యకు రూ.10 వేలు, మేటే చైతన్యకు రూ.5వేలు, మారపాక చరణ్‌కు రూ.5వేల నగదును బ్యాంక్ ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు.

### డీహెచ్‌పీఎస్ మండల కమిటీ ఎన్నిక

వేలేరు (ధర్మసాగర్) : దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ధర్మసాగర్ మండల కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్, కార్యదర్శి రోంటాల దేవా ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రాజారపు రత్నం, అధ్యక్షుడిగా కొలిపాక హరీశ్, ఉపాధ్యక్షులుగా బైరపాక రవి, సహాయ కార్యదర్శిలుగా ఆకారపు అరుణ్, దేవయ్య, కోశాధికారిగా కనకం హరీష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీను, నిఖిల్, సందీప్, అనిల్, తదితరులను ఎన్నుకున్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు బట్టు మల్లయ్య, మండల కార్యదర్శి కొట్టే వెంకటేశ్, డీహెచ్‌పీఎస్ కోశాధికారి రాజ్‌కుమార్, బొట్టు భిక్షపతి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### భూ అక్రమార్కులపై చర్య తీసుకోవాలి

కమలాపూర్ : మండల కేంద్రంలో సమ్మక్క–సారలమ్మ జాతరకు కేటాయించిన భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతర కమిటీ చైర్మన్ ఆస్కార్ అశోక్‌జీ, డైరెక్టర్లు మస్న చంద్రశేఖర్, మౌటం రాజు, మేకల భిక్షపతి, వైనాల సాంబయ్య కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. కమలాపూర్ శివారులోని సమ్మక్క గుట్ట ప్రాంతంలో 720 సర్వే నంబరులోని 80 ఎకరాల్లోని 4 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని, ఆ భూమిలో నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారని ఆరోపించారు. ఐదేళ్ల క్రితం హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను జేసీబీతో తొలగించారని వారు ఆరోపించారు.

### చేయూత..



ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన మాచర్ల రాజేందర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1993 ఆత్మకూరు హై స్కూల్‌లో ఎస్సెస్సీ చదువుకున్న అతని మిత్రులు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.28 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, లక్ష్మీరాజు, నత్తి ఆనందరావు, మాచర్ల రఘు, రేవూరి రత్నాకర్‌రెడ్డి, లింగమూర్తి, నాగరాజు, ఆంధ్రయ్య, తూముల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### 21న 'నాకు నచ్చిన గురువు' పుస్తక ఆవిష్కరణ

వరంగల్ చౌరస్తా: ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ మడత భాస్కర్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'నాకు నచ్చిన గురువు' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 21న నిర్వహించనున్నట్లు రాధాకృష్ణ సహితీ వేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ ఒక ప్రకటలో తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని సామ జగన్‌మోహన్ స్మారక భవన్‌లో పుస్తకాన్ని కవి అందెశ్రీ, తదితరులు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

### నీలాపతాక అమ్మవారిగా రాజరాజేశ్వరీదేవి

హన్మకొండ కల్చరల్: శాకంబరి ఉత్సవాల్లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరీదేవి దేవాలయంలో నిర్వహిస్తున్న భాగంగా ఆషాఢ శుద్ధ ఏకాదశి బుధవారం అమ్మవారిని నీలాపతాక నిత్యగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం అర్చనలు, లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం మహాహారతి ఇచ్చి భోజన ప్రసాదాల వితరణ చేశారు.

### శ్రీలక్ష్మికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మైక్రోబయాలజీ విభాగం పరిశోధకురాలు కె.శ్రీలక్ష్మికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. స్క్రీనింగ్ అండ్ డిటెక్షన్ ఆఫ్ మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియల్ అసోసియేషన్ అండ్ కాంప్లికేషన్స్ ఆన్ క్రానిక్ కిడ్నీ డిసీస్ కంట్రోల్ మేజర్స్ అండ్ ఫ్యూచర్ డైరెక్షన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. మైక్రోబయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ ముంజం పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేశారు.

# ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు
- ఐనవోలులో శాకంబరీగా దర్శనమిచ్చిన భ్రమరాంబిక
- ఆకేరువాగు నీటితో రుద్రాభిషేకం



ఎల్కతుర్తి : వల్బాపూర్‌లో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

ఎల్కతుర్తి : తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఎలకతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని పలు ఆలయాల్లో బుధవారం వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడు, శ్రీ మహా విష్ణువుకు అభిషేకాలు, అర్చనలు జరిపించినట్లు ఆలయ పూజారులు తెలిపారు. అలాగే కొత్తకొండ వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు తెలిపారు.

**కమలాపూర్‌లో..**

కమలాపూర్ : మండల వ్యాప్తంగా తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు, చిన్నారులతో ఆలయం కిక్కిరిసింది.

**ఐనవోలులో..**

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి సన్నిధిలో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామి వారి మేలు కొలుపుతో ప్రారంభం అయిన వేడుకలు.. మహాగణపతి పూజ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించగా భక్తులు తరలివచ్చారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మతో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు ఉప్పుగల్లులోని ఆకేరు వాగు నుంచి వేద మంత్రోచ్ఛరణల నడుమ కొత్త నీరు తీసుకువచ్చి స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామస్తులు బిందెలతో కొత్తనీరు తీసుకొచ్చి లింగాకారుడికి సహస్ర ఘటాభిషేకం జరిపించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని దేవున్ని ప్రార్థించారు. కాగా అర్చకులు మల్లన్న ఉపాలయంలో భ్రమరాంబిక అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించగా అమ్మవారు



ఐనవోలు : గర్భాలయంలో మల్లికార్జునుడు



శాయంపేట : పూజల్లో పాల్గొన్న భక్తులు

శాకంబరీగా భక్తులకు దర్శనమిచ్చింది. అదే విధంగా మండలంలోని పలు దేవాలయాల్లో తొలి ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ మధుమతి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. పండితులు గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు, సిబ్బందితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**శాయంపేటలో..**

శాయంపేట : మండల కేంద్రంలోని శివమార్కండేయ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మార్త రాజ్‌కుమార్ ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, అర్చనలు నిర్వహించారు. తొలి ఏకాదశి పండుగ విశిష్టతను వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.



ఐనవోలు : శాకంబరీగా దర్శనమిస్తున్న భ్రమరాంబిక

# ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఆత్మకూరు : బోనం ఎత్తిన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి



శాయంపేట : ఊరేగింపులో బోనాలతో మహిళలు

ఆత్మకూరు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని పెంచికలపేటలో బుధవారం బీరన్న బోనాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ఆయన హాజరై మొక్కలు చెల్లించారు. గొల్ల, కురుమల ఆరాధ్యదైవం బీరన్న కృపతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

**శాయంపేటలో..**

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని యాదవులు తమ ఆరాధ్య దైవమైన బీరన్నకు, ముదిరాజ్‌లు పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలివెళ్లడంతో పండుగ వాతావరణం నెలకొంది. బీరన్న, పెద్దమ్మతల్లికి మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పించారు. కుల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

**కమలాపూర్‌లో..**



కమలాపూర్ : బోనాలతో వెళ్తున్న భక్తులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్, వంగపల్లి గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గొల్ల, కురుమ కులస్తులు తమ ఆరాధ్య దైవమైన బీరన్నకు బోనాల సమర్పించారు. మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ బోనాలతో ఊరేగింపుగా బీరన్న ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుల పెద్దలు బండారి శ్రీనివాస్, వీరబోయిన అయిలయ్య, కొనుపుల రాంచందర్, మేకల తిరుపతి, గొల్ల, కురుమ కులస్తులు, మహిళలు, చిన్నారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ సదస్సుకు తరలిరావాలి

వేలేరు (ధర్మసాగర్) : యాదగిరిగుట్ట లక్కి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 19వ తేదీన జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారపు సుమన్ బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎస్సీల ఓట్లపైఉన్న ప్రేమ మాదిగల న్యాయమైన డిమాండ్ ఎస్సీ వర్గీకరణపై లేదని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ప్రతి మాదిగ బిడ్డ తరలిరావాలని పిలుపునిచ్చారు.

# ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: చెరువులు, కుంటలను ఆక్రమిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. చెరువులు, కుంటలు కబ్జాకు గురికావడం వల్లనే పలు కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది మురారిశెట్టి యశ్వంత్‌కుమార్, వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ వైస్ చైర్మన్ రంగరాజు ఆనందరావు, ఏపీసీ డబ్ల్యూసీ అధ్యక్షుడు త్రిపురోజు రవికుమార్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య న్యాయ సలహా కమిటీ సమావేశం వరంగల్ శివనగర్‌లోని సమాఖ్య జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా సుదర్శన్ మాట్లాడుతూ దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు 300 సర్వే నంబర్,



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

తిమ్మాపురం బెస్తం చెరువు 241సర్వే నంబర్, మట్టివాడ కోట చెరువు 352 సర్వే నంబర్లతోపాటు రామసముద్రం, గొర్రెకుంటలోని కట్టమల్లన్న చెరువు, శాకరాశికుంట, భద్రకాళి చెరువుల్లోని భూములన్నీ ఆక్రమణలకు గురయ్యాయని వివరించారు. సమావేశంలో న్యాయవాదులు రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, మండలి అధ్యక్షుడు మురహరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### పంపు ఆపరేటర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

దేశాయిపేట: గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పైడిపల్లి గ్రామంలో మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ అనారోగ్య సమస్యలతో మృతి చెందిన జన్ను పటేల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వడ్డేమాన్ కోట తిరుపతి కోరారు. ఈమేరకు జన్ను పటేల్ మృతిపై సంతాపాన్ని వ్యక్తం చేసి బాధిత కుటుంబానికి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పంపు ఆపరేటర్‌గా జన్ను పటేల్ మూడవ డివిజన్‌లో 20ఏళ్లుగా సేవలందించాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జన్ను అరుణాకర్, జన్ను రవి, భాస్కర్, రామచంద్రతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సైడు కాల్వ లేక రోడ్డుపై నిలిచిన వరదనీరు



సైడ్ కాల్వ లేకపోవడంతో మండల కేంద్రంలోని ప్రధాన దారిలో నిలిచిన వరదనీరు

శాయంపేట : మండల కేంద్రం నుంచి ఆత్మకూరు మండల కేంద్రం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టగా శాయంపేట గ్రామంలో రోడ్డు నిర్మాణం కోసం సైడు కాల్వను తొలగించారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యి ఏడాది కావస్తున్నా సైడ్ కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై వరదనీరు నిలిచి చిన్నపాటి తటాకాన్ని తలపిస్తు కంపు కొడుతోంది. భారీ వర్షం కరిస్తే తమ పరిస్థితి ఏంటని సమీపంలోని చిరువ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సైడు కాల్వ నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న వినీల

హన్మకొండ అర్బన్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ కేస్ వర్కర్ వినీల సూచించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీశ్రీ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో మహిళలకు సఖి సేవల గురించి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ సఖి కేంద్రం ముఖ్య ఉద్దేశాలు, అందించే ఐదు రకాల సేవలైన కౌన్సెలింగ్ సహాయం, వైద్య సహాయం, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం గురించి వివరించారు. మహిళలు గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు నుంచి రక్షణ పొందడానికి సఖి కేంద్రం అండగా ఉంటుందని వివరించారు. బాధిత మహిళలు, బాలికలు 181 టోల్ ఫ్రీ నంబర్, 0870 2452112 నంబర్‌కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని చెప్పారు. పారామెడికల్ సిబ్బంది ఎస్.కరుణ, హాస్టల్ వార్డెన్ తిరుమల, విద్యార్థినులు పాల్గొన్నారు.

### నేడు బీసీ కులగణన సాధన సభ

హన్మకొండ: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి రిజర్వేషన్లను బీసీ జనాభా లెక్కల ప్రకారం పెంచే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ స్పష్టం చేశారు. గురువారం ఉదయం హనుమకొండ హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న సమగ్ర కులగణన సాధన యాత్ర సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీ కులస్తులు పార్టీలకతీతంగా తరలివచ్చి బీసీల ఐక్యతను చాటాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతానికి బీసీ రిజర్వేషన్లను పెంచుతామని కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వానికి గుర్తు చేయడానికి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి.. బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సాధన యాత్ర మొదలు పెట్టినట్లు తెలిపారు. ఈనెల 14న కామారెడ్డి నుంచి ప్రారంభమైన యాత్ర ఈనెల 18న హనుమకొండకు చేరుకుందని ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ పేర్కొన్నారు. యాత్రకు అపూర్వ స్పందన వస్తుందని అన్నారు.

# వాడవాడలా పీరీల ఊరేగింపు

దామెర : ఇస్లాం పోరాటయోధులు హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హస్సేన్ ప్రాణత్యాగానికి గుర్తుగా వారి సేవలను స్మరిస్తూ కులమతాలకు అతీతంగా మొహర్రం పండుగను జరుపుకొంటారు. మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకొనే ఈ వేడుకలను మండల వ్యాప్తంగా భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పీరీలను గ్రామాల్లో ఊరేగించి కులమతాలకు అతీతంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించారు. పీరీలకు దట్టీలు, పూలు సమర్పించారు. తాజొద్దీన్, సాబిర్‌అలీ, ఆజాంఖాన్, ఖరీమ్, అఫ్రోజ్, రిజ్వాన్, మదార్, రషీద్, ఫిరోజ్, అమ్జద్ తదితరులు పాల్గొన్నారు.

**కమలాపూర్‌లో..**

కమలాపూర్ : మండల కేంద్రంతో పాటు ఉప్పల్, భీంపల్లి, దేశరాజుపల్లి, అంబాల, పంగిడిపల్లి, గుండేడు గ్రామాల్లో మొహర్రం పండుగ బుధవారం నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా పీరీలను ఊరేగించి ఆయా గ్రామాల్లో నిమజ్జనం చేశారు.

**ఎల్కతుర్తిలో..**

ఎల్కతుర్తి : మొహర్రం పండుగను హిందూ, ముస్లీంలు కులమతాలకు అతీతంగా బుధవారం నిర్వహించారు. పీరీలకు కొత్త దుస్తువులు (దట్టీలు) కట్టడంతో పాటు కుడుకలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కుటుంబ సభ్యులమంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.



దామెర : పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

**పరకాలలో..**

హన్మకొండ (పరకాల) : పట్టణంలో మొహర్రం పండుగను భక్తులు కుల, మతాలకు అతీతంగా జరుపుకొన్నారు. పీరీల ఊరేగింపు అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. కుడుకలతో మొక్కులు చెల్లించుకోవటంతో పాటు వరం పట్టేందుకు మహిళలు పోటెత్తారు. అదే విధంగా బస్టాండ్ కూడలి వద్ద పానీయాలు ఉచితంగా పంపిణీ చేశారు. మసీదు కమిటీ మాజీ అధ్యక్షుడు జలాలోద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాజమొద్దీన్, వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ బియబానీ, ముతావల్లి హమీదుల్ల షరీఫ్, కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏకలవ్య జయంతి

వరంగల్: తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించే ఎరుకల ఆరాధ్యుడు ఏకలవ్య జయంతి వేడుకలను కాశిబుగ్గలోని యువజన సంఘం భవనంలో బుధవారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ స్వర్ణలత ముఖ్యఅతిథిగా పాల్గొని ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఓని భాస్కర్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, నాయకులు పల్లకొండ ప్రభాకర్, పల్లకొండ హరి, పల్లకొండ యాదగిరి, ఓని సదానందం, పల్లకొండ రాజేందర్, మహిళా



ఏకలవ్య జయంతి వేడుకల్లో నాయకులు

సంఘ సభ్యులు మానుపాటి సబిత, మాదగాని సరోజన, ఓని రజిత, పల్లకొండ కల్పన, పల్లకొండ సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

### స్వర్గ రథం అందజేత

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన బైరి అచ్చిరెడ్డి–కాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థంగా వారి కుమారుడు యాదవరెడ్డి–అరుణ దంపతులు స్వర్గ రథాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా ఈ వాహనం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బిల్లా ఇంద్రసేనారెడ్డి, మొగిళి కేశవరెడ్డి, సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, బుర్ర సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మండల రవి, వెంకటేశ్వర్లు, సమ్మయ్య, గ్రామ పాలకులు, పెద్దలు తదితరులు ఉన్నారు.

# రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, విధి విధానాలు ఖరారు చేయాలని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కుడా చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఇనుగాల వెంకట్రామిరెడ్డిని సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు తెలుపుతూ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు దొంతి తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, సురేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, రాజిరెడ్డి, జైహింద్‌రెడ్డి, గణపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పీఆర్‌కే రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### నేడు రైతులతో సీఎం ముఖాముఖి

శాయంపేట : లక్ష రూపాయల లోపు రుణమాఫీ పథకాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించి రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖాముఖి నిర్వహించనున్నట్లు ఏఓ గంగాజమున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల రైతులందరూ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆమె కోరారు. మండలంలోని పెద్ద కోడెపాక రైతు వేదికలో రుణమాఫీ ప్రారంభ కార్యక్రమాన్ని రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అనంతరం ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# 21న గురుపౌర్ణమి

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో ఈనెల 21వ తేదీన శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. గురుధామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల పోస్టర్లను ట్రస్టీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 ఏళ్లుగా గురుపౌర్ణమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. మరో ట్రస్టీ బండారు సాయినారాయణ మాట్లాడుతూ గురుపౌర్ణమి రోజున ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అభిషేకం, హారతి, పుష్పార్చన, పల్లకీ సేవ, గురువందనంలో అఖండ బిల్వార్చన, విభూది, రుద్రాక్షలతో అర్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమములో గందె ఉమాశంకర్, లాయక్ పాల్గొన్నారు.

# నోటీసులివ్వడం సరికాదు

వరంగల్ చౌరస్తా: వరంగల్ హంటర్‌రోడ్డు భద్రకాళి చెరువు సమీపంలో ఏళ్ల తరబడి నివాసముంటున్న గృహవాసులకు నోటీసులు ఇవ్వడం సరికాదని స్థానిక కార్పొరేటర్ గందె కల్పన అన్నారు. హంటర్‌రోడ్డులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1998లో భద్రకాళి బండ్ నిర్మించారని, బండ్ అభివృద్ధికి సంబంధించిన సొమ్మును స్థానికుల నుంచే వసూలు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎన్‌టీఆర్ నగర్ పేరిట ఇళ్ల పట్టాలు పంపిణీ చేయగా, పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని వివరించారు. ఇప్పుడు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పేరిట వారికి నోటీసులు జారీ చేయడంపై కార్పొరేటర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో గందె నవీన్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రామిని సుమన్, నాయకులు కొత్తపెల్లి రాజేష్, లోకేష్, పవన్ పాల్గొన్నారు.